బంగారు వీభూదిపట్టీ మాయం ఘటనలో

ఆలయ ఉప ప్రధాన అర్చకుడు సస్పెన్షన్

ఏఈఓ, సూపరెండెంట్‌లు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లకు మెమోలు జారీ

మాయమైన వజ్రాలు పొదిగిన బంగారు వీబూది పట్టీ

కాణిపాకం, అక్టోబర్ 30 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో వీభూదీ పట్టీ మాయం ఘటనపై ఆలయ ఉప ప్రధాన అర్చకులు ధర్మేశ్వర్ గురుకుల్‌ను ఆలయ అధికారులు సస్పెండ్ చేశారు. అలాగే ఆలయ ఏఈఓ, ఇద్దరు సూపరెండెంట్‌లు, ఇద్దరు టెంపు ఇన్స్‌పెక్టర్‌లకు మెమోలు జారీ చేశారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఆగివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాణిపాకం ప్రధాన ఆలయ మహా కుంభాభిషేకం సందర్భంగా వేలూరు గోల్డన్ టెంపుల్ స్వామీజీ శ్రీనారాయణి అమ్మన్ ముఖ్య అతిథిగా హాజరై సుమారు 18 లక్షలు రూపాయలు విలువగల వజ్రాలు పొదిగిన 320 గ్రాముల బంగారు వీభూది పట్టీని స్వామివారికి ప్రతి రోజూ అలంకరించేందుకు కానుకగా సమర్పించారు. ఇందుకు సంభందించి అప్పటికప్పుడు రశీదులు ఇవ్వకుండా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ధర్మేశ్వర్ గురుకుల్ తన వద్దనే వుంచుకున్నాడు. ఈనేపథ్యంలో దాతలు నెల రోజుల అనంతరం ఆలయ అధికారులను రశీదు ఇవ్వాల్సిందిగా కోరడంతో నిబంధనలకు విరుద్ధంగా భక్తులు సమర్పించిన బంగారు వీభూది పట్టీ మాయం ఘటనపై మంత్రి దృష్టికి విలేకరులు తేవడంతో వెంటనే మంత్రి ఈఘటనపై విచారణకు ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు విచారణ జరిపి దేవాదాయ చట్టం నిబంధనలను అతిక్రమించి దాతలు అందించిన వీభూది పట్టీని అధికారులకు అప్పగించకుండా తన వద్దనే పెట్టుకున్న ఆలయ ఉప ప్రధాన అర్చకులు ధర్మేశ్వర్ గురుకుల్‌ను ఆదివారం సస్పెండ్ చేసినట్లు ఆలయ చైర్మన్ వెల్లడించారు. అలాగే ఈ ఘటనలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన ఆలయ ఏఈఓ, ఇద్దరు సూపరెండెంట్‌లు, ఇద్దరు టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లకు చార్జి మెమోలు జారీ చేసి వివరణ కోరినట్లు తెలిపారు. వారి ఇచ్చే వివరణను బట్టి వారిపై తదుపరి చర్యలు వుంటాయని చైర్మన్ తెలిపారు. అలాగే దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ తిరుమలలో స్వామివారి దర్శన టిక్కెట్‌లను అధిక ధరలకు విక్రయిస్తూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన కరుణాకర్‌ను శాశ్వతంగా విధుల నుండి తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈఘటనలో దేవస్థానం ఏఈఓ హరిమాధవరెడ్డి పాత్ర ఎంత మేరకు వుందో విచారించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఐదు వేల రూపాయలకు తక్కువ విలువగల కానుకలను హుండీలో వేసే విధంగా, ఆపై విలువగల కానుకలకు రశీదులు వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం స్వామివారి ఆభరణాలు భద్రంగా లాకర్‌లో భద్రపరచినట్లు తెలిపారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

శ్రీచెంగాళమ్మకు బంగారు కాసులదండ బహూకరణ

సూళ్లూరుపేట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవికి 151 గ్రాముల బంగారు లక్ష్మీకాసుల హారాన్ని ఆదివారం ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అమ్మణ్ణికి బహూకరించారు. నెల్లూరు అల్లీపురానికి చెందిన వాకాటి సుజాత ఈ కాసుల దండను అందజేశారు. అమెరికాలో నివాసం ఉంటున్న ఆమె కుమార్తె ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న భక్తుల వసతి గదులకు రూ.6 లక్షల విరాళాన్ని ఈ సందర్భంగా ఈఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుకొండలు కిటకిట!

తిరుమల,అక్టోబర్ 30 ప్రభాతవార్తప్రతినిధి:
అనూహ్యంగా పెరిగిన భక్తుల రద్దీ ఆదివారం ఉదయానికి తిరుమలలో క్యూలైన్లు కంపార్టుమెంట్ వెలుపలకు చేరాయి. ఉదయానికి వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు భక్తులతో నిండిపోయాయి. సాధారణ సర్వదర్శనానికి 20గంటల పైగానే సమయం కేటాయించగా సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. ఆదివారం సాయంత్రం వరకు 51వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

చిత్తూరులో మొదలైన రాజకీయ వేడి

అభ్యర్థుల ఎంపికలో నేతలు తలమునకలు

చిత్తూరు, ప్రభాతవార్త:
అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదిన్నరకు పైగా వున్నప్పటికీ జిల్లా కేంద్రం చిత్తూరులో అప్పుడే రాజకీయ సందడి నెలకొంది. అధికార వైకాపాలో అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తు నాయకులు ఇప్పటికే బల ప్రదర్శనకు శ్రీకారం చుట్టారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశంలో ఎన్నికల హడావుడి కన్పించడం లేదు. మరోవైపు పాతిక సంవత్సరాలుగా చిత్తూరు నియోజకవర్గంపై మంచి పట్టు కల్గి వున్న మాజీ ఎమ్మెల్యే సికె బాబు గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా దూరంగా వున్నారు. ఈ సారి ఎన్నికల సమయంలో ఆయన అడుగులు ఎటువైపు అనే విషయంపై ప్రజలు సర్వత్రా ఆసక్తి చూపుతున్నారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంకు 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా సికె బాబు ఎన్నికయ్యారు. ఆపై రాష్ట్ర విభజన జరుగడంతో 2014లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడి నుండి తెలుగుదేశం ఎమ్మెల్యేగా డిఎ సత్యప్రభ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసి ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఓటమిపాలయ్యారు. ఆపై 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన ఆరణి శ్రీనివాసులు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్ ఓటమి పాలయ్యారు. మళ్ళీ అసెంబ్లీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధం అవుతుండటంతో చిత్తూరులో అప్పుడే రాజకీయ వేడి ప్రారంభమైంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్ళీ తనకే వైకాపా అభ్యర్థిత్వం దక్కుతుందని భావించి ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నియోజకవర్గ పరిధిలో పార్టీని పటిష్టం చేయడానికి శ్రమిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన విస్తృతంగా పాల్గొని ప్రజలకు మరింత సన్నిహితం అవుతున్నారు. ఈ సారి ఎలాగైనా చిత్తూరు వైకాపా అభ్యర్థిత్వం దక్కించుకోవాలని భావించి రాష్ట్ర అర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి నియోజకవర్గ పరిధిలో రాజకీయ కార్యకలాపాలను విస్తృతం చేశారు. ఇప్పటికే చిత్తూరు నగర పరిధిలో తన అనుచర వర్గాన్ని బలంగా ఏర్పాటు చేసుకొన్న ఆయన నిరుపేదలకు ఆర్థికంగా అండగా నిలిచి ముందుకు వెళ్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో బలిజ సామాజిక వర్గం నుండి వైకాపాకు చిత్తూరులో ఒక్కరే ఎమ్మెల్యేగా వుండటంతో ఈ సారి అభ్యర్థుల ఖరారులో ఎలాంటి మార్పులు లేకుంటే ఈ సారి అభ్యర్థిత్వం కచ్చితంగా తనకే వస్తుందని ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆశలు పెట్టుకొన్నారు. రాష్ట్ర స్థాయి వైకాపా అధిష్టానంపై ఒత్తిడి తీసుకువచ్చి ఎలాగైనా ఈ సారి పార్టీ అభ్యర్థిత్వం దక్కించుకోవాలని విజయానందరెడ్డి లెక్కలు వేస్తున్నారు. మరోవైపు చిత్తూరు నియోజకవర్గంలో ప్రతిపక్ష తెలుగుదేశం అయోమయ స్థితిని ఎదుర్కొంటుంది. చిత్తూరులో తెలుగుదేశం పార్టీకి అత్యధిక నాయకులు వున్నప్పటికీ వారిలో ఏ ఒక్కరిని పార్టీ అధిష్టానం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పగించలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్ అనంతరం జరిగిన



పరిణామాలతో పార్టీకి రాజీనామా చేయడంతో అప్పటి నుండి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీని నియమించలేదు. నగర పార్టీ అధ్యక్షురాలిగా వున్న మాజీ మేయర్ కఠారి హేమలతకు పార్టీ అభ్యర్థిత్వం లభించే అవకాశాలు వున్నట్లు పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు స్వయంగా ఆమె ఇంటికి రెండుసార్లు వచ్చి వెళ్ళడంతో ఆమెకు అభ్యర్థిత్వం ఖరారు అయ్యే అవకాశం వుంటుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అలాగే దివంగత మాజీ టిటిడి ఛైర్మన్, మాజీ ఎంపీ డికె ఆదికేశవులు కుమారుడు డిఎ శ్రీనివాసులుకు ఈ సారి పార్టీ అభ్యర్థిత్వం దక్కుతుందనే ప్రచారం జరుగుతుంది. అలాగే ఇక్కడి నుండి అభ్యర్థిత్వం కోసం జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినానిలు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు అందరి చూపు మాజీ ఎమ్మెల్యే సికె బాబు వైపు నిలిచింది. పాతిక సంవత్సరాల పాటు ఏకచక్రాధిపత్యంగా చిత్తూరు నియోజకవర్గంను ఏలిన సికె బాబు ప్రస్తుతం స్తబ్దుగా వున్నారు. 2014 ఎన్నికలకు ముందు వైకాపాలో చేరి పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విజయంకు శ్రమించిన మాజీ ఎమ్మెల్యే సికె బాబు 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరి తెలుగుదేశం అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్ విజయంకు కృషి చేశారు. ఈ రెండు ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. చిత్తూరు నియోజకవర్గంతో పాటు పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యే సికె బాబుకు గట్టి అనుచర వర్గం వుంది. ఈ పరిస్థితుల్లో ఆయన అడుగులు ఈ ఎన్నికల సమయంలో ఎటు పడుతాయని ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఎన్నికలకు ముందు వైకాపాలో చేసి చిత్తూరు నుండి సికె బాబు పోటీ చేయడానికి ప్రయత్నిస్తారనే ప్రచారం జరుగుతుంది. ఈ ప్రచారం ఎంత వరకు వాస్తవ రూపం దాల్చుతుందనేది చూడాల్సి వుంది.

చంద్రిత, చంద్ర సేఫ్!

పోలీసులకు సవాలుగా మారిన గుర్తుతెలియని శవాలు

చంద్రిత,చంద్రల ఫోటో

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త
వారం రోజుల పాటు శ్రీకాళహస్తి పట్టణంలో ఉత్కంఠత లేపిన చంద్రిత కిడ్నాప్, తెలుగుగంగలో శవం చంద్రికదే అంటూ సాగిన హైడ్రామాకు ఆదివారం చంద్రిత, చంద్రశేఖర్‌లు పంపిన ఓ వీడియో ద్వారా వారిద్దరు సేఫ్‌గానే ఉన్నట్లు తెలిసింది. అయితే తెలుగుగంగలో దొరికిన శవం,ఏర్పేడులో మరో మగవాని శవాలు ఎవరివి అన్నది పోలీసులకు సవాలుగామారింది. వారం రోజుల పాటు పోలీసులు తీవ్ర వేదనకు గురయ్యారు.శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన చంద్రిత, రామాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌లు ప్రేమించుకున్నారు. వారు ఈ ఏడాది జనవరి 10నుంచి కనబడటం లేదు.అయితే వారం క్రితం తెలుగుగంగలో ఓ శవం కనబడిందనటంతో చంద్రిత తల్లిదండ్రులు ఆ గుర్తుతెలియని శవం తన బిడ్డదే అని ఠాకూర్ అతని భార్యలు పోలీసుస్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేసారు. అయితే గుర్తు తెలియని శవం కాబట్టి డిఎన్ఏ పరీక్షలు జరిపి నిర్ధారిస్తామని పోలీసులు చెప్పినా ఖాతరు చేయక తల్లిదండ్రులు ఎస్‌పికి ఫిర్యాదు చేసారు. వారు స్పందించలేదని రాజకీయ నాయకులు ధర్నాలు చేపట్టారు.అయితే ఆదివారం హిచ్ కాక్ సస్పెన్స్‌లా వారిద్దరు సేఫ్‌గానే ఉన్నట్లు పేర్కొంటూ వీడియోలు పంపారు.

పోలీసులకు సవాలు:
చంద్రిత, చంద్రశేఖర్ క్షేమంగానే ఉన్నట్లు అయితే మరి తెలుగుగంగలో లభించిన బాలిక, ఏర్పేడులో దొరికిన మగశవాలు ఎవరివి అన్నది సవాలుగా మారింది. ఇక రెండు శవాలకు సంబంధించి పోలీసులకు సవాలుగామారింది. ఈ నేపథ్యంలో దొరవారిసత్రంలో చంద్రిత మిస్సింగ్‌కు సంబంధించి కేసు ఎఫ్ఐఆర్ అయ్యింది. కాబట్టి వీడియో వచ్చింది కాబట్టి ఆ ప్రాంతం పోలీసులు వెతికి పట్టుకోవాల్సి ఉంది.అయితే ఇక్కడ ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు కట్టక తప్పదు.ఇద్దరు ఇష్టపడి వెళ్ళారు కాబట్టి వారైనా వచ్చి పోలీసులకు సంప్రదించాలి.ఐతే ఇప్పటికి చంద్రిత మైనరే అని తెలిసింది.

ప్రజాస్వామ్యం పరిరక్షణే ధ్యేయం

-ఆత్మగౌరవ ర్యాలీ కాదు...వైకాపా బలవంతపు బల ప్రదర్శన
-వూకా విజయకుమార్, సైకం జయచంద్రారెడ్డి, కిరణ్‌రాయల్

4లో

ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం ప్రతిపక్షాలన్ని మిత్ర పక్షాలై ఎదురొడ్డి పోరాడాలని పూర్వ ప్రజారాజ్యం పార్టీ నాయకులు పిలుపు నిచ్చారు.

నవంబర్ 1 నుంచి సంప్రదాయ దుస్తులుంటేనే అంతరాలయ దర్శనం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంప్రదాయాల్ని పరిరక్షించుటకు ఆలయంలో భక్తి భావం పెంపొందించుటకు పాలకులు,అలయాధికారులు పలు సంస్కరణలు చేపట్టారు.ఈ నేపథ్యంలో నవంబర్ 1 నుంచి అంతరాలయ దర్శనాలకు వచ్చే వారు ఆడ,మగ సంప్రదాయ దుస్తుల్లోనే రావాలనే నిబంధన అమలు చేయనున్నట్లు ఆదివారం ఇఓ వికెసాగర్‌బాబు ఓ ప్రకటన విడుదల చేసారు.పురుషులు దోతి,కుర్తా,మహిళలు చీర లేదా చుడీదారులతోనే రావాలనే నిబంధనను రూపొందించి అమలు చేయటానికి సుమూహూర్తంగా నవంబర్ 1ని ఖరారు చేసారు.ఈ మేరకు విఐపిలు కూడా సహకరించాలని కోరారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయంలోకి అభిషేకాల సందర్భంగా డ్రెస్‌కోడ్‌ను అమలు చేస్తున్నారు.

బంగారు నెమలివాహనంపై కుమారస్వామి దర్శనం

ఘనంగా స్కంధషష్ఠి ఉత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 30 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం స్కంధషష్ఠి సందర్భంగా ఆలయంలో వెలసిన వళ్ళిదేవసేపకుమార స్వామి ఉత్సవమూర్తిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం బోయిలు అలంకారమండపం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి బంగారు నెమళివాహనంపై ఆశీనుల్ని చేశారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవాన్నికన్నులపండువగా నిర్వహించారు.

తమిళ సరిహద్దుల్లో ఆంధ్రావారి వీధి భాగోతాలు

తమిళనాడు సరిహద్దుల్లో వీధి భాగోతం కళాకారుల

తెరుకూతు పేరుతో కొనసాగుతున్న పురాతన కళ - అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత మనదే
ప్రభుత్వం ఈ కళాకారులను గుర్తించాల్సిందే - కృష్ణపట్నం నుంచి చెన్నపట్నం దాకా విస్తరించిన ఆటాపాటా

తడ, అక్టోబర్ 30 ప్రభాతవార్త
సినిమాలు, టెలివిజన్లు, స్మార్ట్‌ఫోన్ల రాకతో అంతరించిపోయిన కళల్లో వీధిభాగోతం ఒకటి. సామాన్యులకు, ముఖ్యంగా పల్లెటూర్ల జనాలకు ఒకప్పుడు ప్రధాన వినోద సాధనంగా ఉన్న ఈ వీధి భాగోతాలు కనుమరుగైపోతున్నాయి. అయితే ఇప్పటికీ ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో తెరుకూతు పేరుతో తమిళ భాగోతం కొనసాగుతోంది. పండగలు, తిరునాళ్లు, కర్మక్రియల్లో మాత్రమే ఈ కళను ప్రదర్శిస్తున్నారు. ఇది తమిళ భాషలో ఉన్నప్పటికీ ఆంధ్రా ప్రాంతానికి చెందిన కళాకారులు రెండు రాష్ట్రాలకు చెందిన వివిధ గ్రామాల్లో ప్రదర్శిస్తున్నారు. తిరుపతి జిల్లా తడ మండలం వాటంబేడు కుప్పంకు చెందిన తెరుకూతు భాగోతం కళాకారులు పులికాట్ సరస్సు, బంగాళాఖాతం సముద్రం ఒడ్డున ఉన్న గ్రామాలకు వినోద సాధనంగా మారారు. ఇటీవల ఈ కళాకారులు పెరటాశి నెల సంబరాలలో ఎక్కువగా ఆడిపాడారు. అయితే వీరిని ప్రభుత్వం ఇప్పటిదాకా గుర్తించలేదు. కళాకారుల పేరుతో ఎంతో మందికి అందుతున్న పింఛన్ సౌకర్యం కూడా తమకు దక్కలేదని కళాకారులు వాపోయారు.

వీధి భాగోతాలు ఇలా...
ఈ తరం వారికి వీధి భాగోతాల గుర్తించి తెలియదేమో గాని కొన్ని దశాబ్దాలుగా వీటికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రామాయణ, మహాభారత, భాగవత కథలన్నింటినీ మొదట వీధుల్లో భాగవతం పేరుతో ప్రదర్శించారు. అప్పట్లో ఈ కళకు రాజపోషకులు ఉండేవారు. గ్రామపెద్దలు ,కళలను ప్రోత్సహించే కొన్ని కుటుంబాల వారు తమ వీధుల్లో భాగవతాలు ఆడించుకొని వినోదించేవారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా కేవలం మగవారు మాత్రమే ఈ కళలో పురుష, మహిళా పాత్రలను వేస్తూ విన్యాసాలు చేస్తుంటారు.

భాగోతాల నుంచే సినిమాలు
దక్షిణాది రాష్ట్రాల్లో పురాణ కథలకు ఎంతో పేరుంది. ప్రారంభంలో సినిమాలు అన్నింటినీ పురాణాల ఆధారంగానే నిర్మించారు. ఉదాహరణకు తెలుగులో ఎంతో ప్రసిద్ధి చెంది ఇప్పటికీ నంబర్ వన్ క్లాసిక్‌గా గుర్తింపులో ఉన్న మాయాబజార్‌ను తెలుగులో శశిరేఖా పరిణయం పేరుతోనూ, తమిళంలో వత్సలా కళ్యాణం పేరుతోనూ వీధిభాగోతాలు ఆడారు. సుందరమాల పేరుతో ప్రస్తుతం ఈ కథను మన తెలుగు వారు తమిళంలో భాగోతంగా ప్రదర్శిస్తున్నారు. మన తెలుగు వారికి తెలియని అరవాన్ కడబలి, పోర్కున్నన్ సంగోది, కోర్‌మన్నుడు వంటి కథలు తమిళంలో ఎంతో ప్రసిద్ధి చెందాయి.

భాగోతం గురువు దివ్యాంగుడైన రాయపురం అంకయ్య

కళాకారులను ఆదుకోండి
వీధిభాగోతాలు ఆడే కళాకారులను ప్రభుత్వం గుర్తించాలని ఆంధ్రా, తమిళనాడు ప్రాంతాలకు చెందిన పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అతికొద్ది గ్రామాల్లో మాత్రమే ఉన్న ఈ కళాకారులను గుర్తించడం పెద్ద కష్టమేమీ కాదని, వీరికి పింఛన్ వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు కళకు అవసరమైన సామగ్రిని అందిస్తే మరిన్ని గ్రామాల్లో స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం ఉంటుందన్నారు. తడ మండలం వాటంబేడు కుప్పానికి చెందిన కరింగాలి గురునాథం, రాయపురం అంకయ్యలు కళాకారులకు ఈ విద్య నేర్పుతున్నారు. తమ పూర్వీకుల నుంచి తాము ఈ కళను అభ్య సించామని ఇప్పటికీ చెన్నైలో వీధి భాగోతం గురించిన కథలు లభిస్తాయని వీరు చెప్పారు. బుస్సంముత్తు, బోడి చంద్రమోహన్, తాంగి రజని, కరిం గాలి భాస్కర్, అంకయ్య, ముదిపాలెం కందయ్య, కరింగాలి రాజేంద్ర, వన్నిక చిరంజీవి, ధర్మం కుప్పయ్య, తాంగి అంకయ్య... ఇలా ఎంతో మంది కళాకారులు ఈ ప్రదర్శనల్లో విరివిగా పాల్గొంటున్నారు. తిరుపతి జిల్లా నాగలాపురం సమీపంలోని శిరనంబూదూరు, తమిళనాడుకు చెం దిన ఆరంబాకం తదితర ప్రాంతాల నుంచి మేకప్ సామగ్రి తెచ్చుకుం టున్నామని ఈ కళను నేర్పిస్తున్న పోలియో వ్యాధి బాధితుడు, దివ్యాం గుడైన గురువు రాయపురం అంకయ్య పేర్కొన్నారు. ఇటు కృష్ణపట్నం నుంచి అటు చెన్నపట్నందాకా పలు గ్రామాల్లో ప్రదర్శించినట్లు వివరించారు.

ఉష్ణోగ్రతలు

30/10/2022

- తిరుపతి 31 డిగ్రీలు
- చిత్తూరు 32 డిగ్రీలు
- మదనపల్లి 26 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 32 డిగ్రీలు
- వెంకటగిరి 31 డిగ్రీలు
- గూడూరు 32 డిగ్రీలు

బంగారం ధరలు

30/10/2022

22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,703
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,131

కోడిగ్రుడ్డు ధరలు

30/10/2022

కోడిగ్రుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఎన్‌సిసి క్యాడెట్ బాధ్యత

చిత్తూరురూరల్, అక్టోబరు 30 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఎన్‌సిసి క్యాడెట్ బాధ్యతగా తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. 35 ఆంధ్ర బెటాలియన్ కంబైన్డ్ యాన్యువల్‌ట్రైనింగ్ క్యాంపు నందు ఆదివారం ఎన్‌సిసి క్యాడెట్లకు జీవవైవిధ్యం, పర్యావరణం కాలుష్యంతో ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి జీవి మనకు ఏదో రూపంలో ప్రయోజన కల్పిస్తుందో. కాకి పారిశుధ్యంలో, తేనె టీగలు ఆహార ఉత్పత్తిలో, వానపాము భూమిని సారవంతం చేయడంతో ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నామన్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గిపోవడంతో మన మనుగడ ప్రమాదకంగా మారబోతోందన్నారు.

ఈ కార్యక్రమంలో క్యాంపు కమాండంట్ అజయ్ బేస్‌నెట్, డిప్యూటీ క్యాంప్‌కమాండెంట్ రంగనాథన్, ఎన్‌సిసి అధికార్లు ప్రసాద్‌రెడ్డి, రమేష్, గిరిధర్‌నాయక్, జగదీష్,రాజు, సుబేదార్ మేజర్ బి.బి. చత్రి, సత్యనారాయణలతో పాటు ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలి

తవణంపల్లె, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

త్రైత సిద్ధాంత భగవద్గీత, త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం-2 కమిటీ అధ్యక్షులు ధనంజయ అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం-2 సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆధ్వర్యంలో మండలంలో జరుగుతున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం మిట్టపల్లె, దిగువ తడకర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆద్యాత్మిక గ్రంధములపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు.పౌర్ణమి రోజున దేవాలయాల్లో ధ్వజస్థంభంపై దీపాలు వెలిగించడం అనేది దేవాలయంలో దేవుని రాజ్యం ప్రారంభమైనట్లని తెలిపారు. కమిటీ అధ్యక్షులు ధనుంజయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు చటర్జీ, రాజేంద్ర, చాముండి, హేమంత్, లలిత, రెడ్డెమ్మ, మంజుల, రేఖ, కళ్యాణి, నాగమ్మ, విమలమ్మ, కిట్టూ ధర్మేష, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా కృషి

- గంగమ్మ గుడి ఛైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్

కుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తున్నామని ఆలయ ఛైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆల యం వద్ద ఆయన ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి పాత కట్టడాల తొలగింపును పరిశీలిం చారు. సుమారు 2.50కోట్లరూపాయలతో ఆలయాన్ని భక్తులకు అనువుగా అత్యంత ఆధునాతనంగా నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పాత నిర్మాణాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని త్వరలోనే ఆలయంలో పునర్నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి

గుడుపల్లె, అక్టోబర్ 30 ప్రభాతవార్త

మండలంలోని శెట్టిపల్లి వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డ విషయం విదితమే. వీరిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పాపానూరుకు చెందిన అరుణ్ మృతి చెందినట్లు గుడుపల్లె పోలీసులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మరో యువకుడు రూపేష్ పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు తెలిసింది.

తెదేపా రాష్ట్ర మైనార్టీ నేత గనిచే భారీ ఎత్తున అన్నదానం

కుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి గనీవుల్లా అధ్వర్యంలో ఆదివారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తన జన్మదినం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన 500మందికి అన్నదానం జరిపారు. కార్యక్రమాల్లో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, ఐటిడిపి నరేష్, కుప్పం సమాచారం కలీం, అజీం, ఏజాజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సయ్యద్ సర్దార్‌కు డాక్టరేట్ ప్రదానం

చిత్తూరురూరల్, అక్టోబరు 30 ప్రభాతవార్త: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్పొరేటర్ సయ్యద్ సర్దార్‌ను ప్రముఖ అంతర్జాతీయ యూనివర్శిటీ ఐ యూసి ఎడ్యుకేషన్ కౌన్సిల్ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. నగర పరిరక్షణ కమిటీ ఏర్పాటుచేసి గత 12సంవత్సరాలుగానగరవాసులకువిశేషంగా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న సయ్యద్ సర్దార్ ఆదివారం సాయంత్రం హోసూరులోని సెవెన్‌హిల్స్ హోటల్‌లో జరిగిన డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో యూనిసెఫ్ ఛైర్మెన్ డాక్టర్ ప్రభు, డిఎంకే ఎమ్మెల్యే ప్రకాష్, ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ భువనేశ్వరి చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కాగా సయ్యద్ సర్దార్‌ను నగర కమీషనరుతో పాటు మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్,రాజేష్‌కుమార్‌రెడ్డిలు, కార్పొరేటర్లు, వైకాపా పార్టీనాయకులు, కార్యకర్తలు అభినందించారు.

వైసీపీ సీనియర్ నాయకుడి మృతికి సంతాపం

సదుం, అక్టోబరు 30 ప్రభాతవార్త

మండల పరిదిలోని యర్రాతివారిపల్లె పంచాయతీ గొడ్లవారిపల్లెకు చెందిన వైసీపీ సీనియర్‌నాయకుడు వెంకట్రామిరెడ్డి గత పది రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఆయనమృతికి సంతాపం తెలిపారు. వెంకట్రామిరెడ్డి మృతి చెందడంచాలా బాధాకరమని చెప్పారు. వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ ఎన్‌రెడ్డెప్పలు నివాళులర్పించారు. వారి వెంటజడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మెంబరు ముత్తంశెట్టి విశ్వనాధం, ఎంపీటీసీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా పుంగనూరుహౌసింగ్ ఈఈ బి.నరసింహాచారి మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మంత్రి సానుభూతి ప్రకటించారు. అత్యంత నిబద్ధతతో అంకిత బావంతో విదులు నిర్వహించే అధికారిని కోల్పోవడం బాధాకరం అని వారి కుటుంబసభ్యులకు అండగా ఉంటామని మంత్రి పేర్కొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

నిరాశ్రయుల ఆరోగ్యం కోసం నిరంతర వైద్యసేవలు

చిత్తూరురూరల్, అక్టోబరు 30 ప్రభాతవార్త:

నిరాశయుల ఆరోగ్యం కోసం నిత్యం వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యసేవలు అందిస్తున్నట్లు నిరాశయుల వసతి గృహ నిర్వాహకులు జోసఫ్‌రాజు తెలిపారు. ఆదివారం నిరాశయుల వసతిగృహంలో సపోర్టు సంస్థ ఏఐటిజె సహకారంతో అపోలో వైద్యులచే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వైద్యులు నిరాశ్రయుల ఆరోగ్య స్థితిగతులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సోఫియా, అపోలో డాక్టర్ సిద్దిక్, డాక్టర్ జన్నత్, ఏఐటిజె ఆర్గనైజేషన్ సభ్యులు హాసిక్, బషీర్, జుబేర్,ఉమర్‌ఫరూక్, వసతిగృహసిబ్బందిప్రమీల, ప్రసన్న, కుసుమకుమారి, శ్రీను పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో ద్వితీయ స్థానం

సదుం,అక్టోబరు30 ప్రభాతవార్త

సదుం పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రాంబాబు అనే కానిస్టేబుల్ ఇటీవల పోలీసుల అమర వీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఆయన ద్వితీయ బహుమతి పొందారు. జిల్లా స్థాయిలో మహిళా భద్రతలో పోలీసుపాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ద్వితీయ బహుమతి పొందిన రాంబాబుకు చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి,ఏఎస్పీ జగదీష్‌ల చేతుల మీదుగా ప్రసంశాపత్రం, మూడు వేలనగదు బహుమతిని అందుకున్నారు. సదుం ఎస్సై మారుతి, ఎఎస్సై వందన,సిబ్బంది ఆయనను అభినందించారు.

అభివృద్ధి.. సంక్షేమమే సిఎం జగనన్న లక్ష్యం - ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త

ప్రజల సంక్షేమం, అభివృద్ధే సిఎం జగనన్న లక్ష్యమని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. ఆదివారం కొటాలూరు, గుండ్ల మడుగు ప్రాంతాల్లో గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్నిఆయన చేపట్టారు. ఈసందర్భంగా ప్రతి ఇల్లు తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నా యా లేదాఅనిఅడిగితెలుసుకున్నారు.ప్రజలకష్టసుఖాలు తెలుసుకునేందుకే గడపగడపకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌హెచ్‌ఎంమురుగేష్,జడ్పీటిసిఎడిఎస్‌శరవణ,టెలికాంబోర్డుసభ్యుడువెంకటేష్, రాష్ట్రవన్నియకుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, ఎంపిడిఒ జానకమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంకు పెద్దపీట

- మున్సిపల్ ఛైర్మన్ డా॥సుధీర్

- సోడిగానిపల్లిలో శ్రీప్రియ నర్సింగ్‌హోంచే ఉచిత వైద్యశిబిరం

గుడుపల్లె, అక్టోబర్ 30 ప్రభాతవార్త

పేదల ఆరోగ్యంకు తాము పెద్దపీట వేస్తున్నట్లు కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీప్రియ నర్సింగ్‌హోం అధ్వర్యంలో సోడిగానిపల్లిలో ఉచిత వైద్య శిబిరంను జడ్పీఛైర్మన్ శ్రీనివాసులుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఛైర్మన్ డా॥ సుధీర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే తాను ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవసేవే మాధవసేవ అన్నారు. జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. పార్టీకోసం, ప్రజల కోసం డా॥ సుధీర్ కష్టపడుతున్నారని అభినందించారు. ఈసందర్భంగా 700మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి కృష్ణమూర్తి, మండల కన్వీనర్ రామకృష్ణ, సీనియర్ నేతలు గోవిందన్, నారాయణస్వామి, సర్పంచ్ సుశీల, ఎంపిటిసి లక్ష్మిదేవి, వైద్యులు ప్రశాంత్ గౌడ, దిలీప్, సుదర్శన్, దీప్తి, విష్ణువర్ధన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

116 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తవణంపల్లె, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

చౌకధర దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంను రాష్ట్రం నుండి అక్రమంగా కర్నాటక రాష్ట్రానికి తరలిస్తుండగా ఆదివారం పట్టుకుని సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై ప్రసాద్ తెలిపారు. తిరుపతి వైపునుండి అశోక్ లైలాండ్ దోస్త్ వాహనంలో 116 బస్తాల్లో సుమారు మూడు టన్నుల రేషన్ బియ్యంను ఏపీనుండికర్నాటక రాష్ట్రానికి తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా బైరెడ్డిపల్లె మండలంఆకుల కొత్తూరుకు చెందిన ఎ.కుమార్‌రెడ్డి(34), మురారి పల్లెకు చెందిన బి.శివకుమార్(23)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

కార్తీక మాసానికి ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజి

సూళ్లూరుపేట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సూళ్లూరుపేట డిపో నుంచి అక్టోబర్ 31వ తేదీ, నవంబర్ 7, 14, 21 తేదీల్లో ప్రత్యేక టూర్ ప్యాకేజిని ఏర్పాటు చేసినట్లు సూళ్లూరుపేట డిపో మేనేజర్ ఎస్.మల్లిఖార్జున ఆదివారం తెలిపారు. ఈ ప్యాకేజిలో భాగంగా విశిష్ట శైవక్షేత్రాలైన నాగలాపురం వెంకటేశ్వరాలయం, సురుటుపల్లి, కపిలతీర్థం, శ్రీకాళహస్తి, తిరుచానూరు, ఇతర ముఖ్య దేవాలయాల సందర్శనను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.350 టికెట్లు రేట్లుగా నిర్ణయించామని డిపో మేనేజర్ చెప్పారు. ప్రతి సోమవారం ఉదయం 4 గంటలకు ఆర్టీసీ బస్టాండు నుంచి ఈ ప్రత్యేక బస్సు బయలుదేరి రాత్రి 8 గంటలకు సూళ్లూరుపేటకు చేరుకుంటుందని, ఆసక్తి గలవారు బస్టాండులో టికెట్లు రిజర్వు చేసుకోవాలని ఆయన కోరారు.

మన్నారుపోలూరులో బాదుడే బాదుడు

సూళ్లూరుపేట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు గ్రామంలో ఆదివారం బాదుడే బాదుడు కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలకు వివరించారు. ప్రజలు ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక కార్యక్రమాలను నిరసించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా బాదుడే బాదుడు కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని, కేవలం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేయలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆకుతోటరమేష్,చిట్టేటిపెరుమాళ్లు,అలవలశ్రీనివాసులు, కె.పెంచలయ్య, సురేష్, పామూరు మునస్వామి, పి.సుబ్బయ్య, సీహెచ్ రమణయ్య, లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఏజీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల కన్నా రక్తదానం గొప్పది

- నాయుడుపేట సీఐ ప్రభాకర్‌రావు

నాయుడుపేట రూరల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త

రక్తదానం అన్ని దానాల కంటే గొప్పదని నాయుడుపేట సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు అన్నారు. నాయుడుపేటలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నాయుడుపేట సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రక్తదాన శిబిరాన్ని సీఐ పరిశీలించారు. రక్తదాన శిబిరంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పెద్దఎత్తున రక్తదానం చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య యువసేన అధ్యక్షులు కోట్లపూడి రాజేష్, మస్తాన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో స్వచ్ఛభారత్

కోట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లో ఆదివారం నెహ్రూ యువకేంద్రం వారి ఆధ్వర్యంలో క్లీన్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టారు. మహాత్మాగాంధీ కలలు గన్న పరిశుభ్ర భారతావనినిసాధించడమే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని నెహ్రూ యువకేంద్రం వాకాడు బ్లాక్ వాలంటీర్ కలవాడి సోనియా తెలిపారు. విద్యానగర్‌లోని కళాశాల రోడ్డు పక్కల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, దాని ద్వారా కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కిషోర్, స్వాయిస్వరూపరెడ్డి, రఘు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం

కోట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం హరిజనవాడలో శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణ మహోత్సవాన్ని హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ గూడూరు డివిజన్ కన్వీనర్ బీవీ అనంతచార్యులు, కోన సాయిబాబా స్వామి జరిపించారు. ఈ సందర్భంగా అనంతచార్యులు మాట్లాడుతూ ప్రవాసభారతీయులు రామిరెడ్డి, మధుకిరణ్ వారి కుటుంబ సభ్యులచే స్థాపించబడిన శ్రీసీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో మాసం-మాసం శ్రీవారి కల్యాణం అనే కార్యక్రమాన్ని మొ ట్టమొదటిసారిగా ఈ దేవాలయంలో సీతారాముల కల్యాణంతో ప్రారంభించినట్లు చెప్పారు. బాలిరెడ్డిపాలెం శ్రీపట్టాభి రామాలయం కేంద్రంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్య క్రమంలో స్థానిక నాయకులు నేదురుమల్లి హరీష్ చంద్రారెడ్డి, విశ్రాం తఅధ్యా పకులు నారాయణరావు,వెంకటయ్య,చిన్నపరశురామయ్య, కృష్ణమ్మ, శ్రీరామ సేనయువకులుహరీష్‌రెడ్డి,కిరణ్‌మోహన్, గురుప్రసాద్,దినేష్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ

- అవస్థల్లో ప్రజలు

కోట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

మేజర్ పంచాయతీ కోటలో డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కోటలోని ముస్లిం వీధిలో ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు ఎంపీ నిధులు రూ.10లక్షలతో డ్రైనేజి కాలువను మంజూరు చేయించారు. ఆ మేరకు ఆ కాలువ పనులను అక్కడే పూర్తి చేశారు. కాని ఆ కాలువను నేరుగా పంట కాలువ వరకు పనులు చేసి ఉంటే ఈ మురుగునీరు పంట కాలువలోకి చేరేవి. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే మార్గంలోనే వదిలేశారు. దీంతో ఆర్టీసీ బస్టాండులోకి వెళ్లే ప్రయాణికులు ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు మంచి మనసుతో ఆ డ్రైనేజి కాలువను పొడిగించి నిధులు మంజూరు చేయిస్తే ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని చెప్తున్నారు.

మోటార్‌సైకిల్ బోల్తా : ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట రూరల్, అక్టోబరు 30 ప్రభాతవార్త:

నాయుడుపేట మండలంలోని మేనకూరు సమీపంలో మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆది వారం సాయంత్రం జరిగింది.నాయుడుపేటకు చెందిన రాము, చంద్ర య్యలు మేనకూరు సమీపంలో ఉన్న గ్రీన్‌టెక్ కంపెనీలో పనులు పూర్తిచేసుకొని తిరిగి సాయంత్రం నాయుడుపేటకు వస్తుండగా మార్గమధ్యలో మేనకూరు వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్నరాము,చంద్రయ్యలుతీవ్రంగాగాయపడ్డారు.స్థానికులుగుర్తించి క్షతగాత్రులను 108 సాయంతో చికిత్స నిమిత్తంనాయుడుపేటకుతరలించారు.నాయుడుపేటపోలీసులుకేసునమోదుచేసిదర్యాప్తు చేస్తున్నారు.

పిఇఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పెద్దపంజాణి, అక్టోబర్ 30 ప్రభాతవార్త :

కుప్పం పి.ఇ.ఎస్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో జెడ్పీటిసీ సుష్మాబాగారెడ్డి,సర్పంచ్ అఖిలాజాఫర్, అధ్యక్షతన పెద్దపంజాణి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని ప్రజలకు మెడికల్ కళాశాల వైద్యులచే పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుష్మాబాగారెడ్డి మాట్లాడుతూ పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాల మేరకు మండలంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే నేపథ్యంలో కుప్పం మెడికల్ కళాశాల వైద్యుల సహకారంతో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు జగదీష్, మండల కన్వీనర్ బాగారెడ్డి,సర్పంచుల సంఘం అధ్యక్షులు హరినాథ్,వైస్ ఎంపీపీ జి.డి.బాబు,సతీస్ రెడ్డి,సర్పంచ్ మురళి,చెన్నారెడ్డి, రెడ్డిబాషా,శ్రీరాములు రెడ్డి.బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగుల కార్యవర్గం

బంగారుపాళ్యం, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

జిల్లాలో వున్న వ్యవసాయ మార్కెట్ కమిటీలలో కాం ట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆసంఘ జిల్లా మహాసభ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకట రత్నం మాట్లాడుతూ డిసెంబర్ 10న విజయవాడలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇతర ఉద్యోగుల మాదిరిగానే సమాన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో ఉద్యోగి చనిపోతే 10 లక్షలు పరిహారం కింద చెల్లించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్(కుప్పం), ప్రధాన కార్యదర్శిగా అక్కులప్ప(చిత్తూరు), ఉపాధ్యక్షుడిగా శ్రీననివాసులు(పలమనేరు), కోశాధికారిగా రఘుపతి(బంగారుపాళ్యం), సంయుక్త కార్యదర్శులుగా మల్లిఖార్జున, జపయపాల్, పలువురు సభ్యులు ఎన్నికయ్యారు.

జెడ్పీ,కుప్పం మున్సిపల్ ఛైర్మన్లకు ఘన సన్మానం

పెద్దపంజాణి అక్టోబర్ 30 ప్రభాతవార్త :

జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు,కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్‌లను ఆదివారం స్థానిక వైకాపా నాయ కులు ఘనంగా సత్కరించారు.రాజుపల్లి అమ్మవారి ఆలయంలో వీరు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రమైన పెద్దపంజాణిలో కుప్పం పి.ఇ.ఎస్ వైద్య కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిభిరాన్ని నిర్వహించగా ఈ శిబిరాన్ని జెడ్పీఛైర్మన్ శ్రీనివాసులు,కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్‌లు సందర్శించారు. వైద్యశిబిరంలో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.గ్రామీన పేదలకు మెరుగైన వైద్యసేవలు ఉచితంగా అందించడం పట్ల వారు పి.ఇ.ఎస్ వైద్యులతోపాటు స్థానిక వైద్యులను అభినందించారు.డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి,నాయకులు తమ్మిరెడ్డి,శంకర్ రెడ్డి,సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నార

ప్రజల కోసం ఏమైనా చేస్తా - ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట, అక్టోబరు 30 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యేగా తాను దేనికైనా సిద్ధమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలతో రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఆయనకు మంగళ హారతులు ఇచ్చి ఆప్యాయంగా ఆహ్వానించారు. పుష్ప వర్షం కురిపించడంతో పాటు, గజమాలతో సత్కరించారు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, మధుసూద న్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. గడప గడపకు తిరిగిన ఎమ్మెల్యే అందరి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ

పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. అందని వారికి ఎందుకు అందలేదని అధికారులను నిలదీశారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. పాలసీ సమస్యలను ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. జగనన్న పార్టీ పెట్టింది ప్రజల కోసమని ప్రజలకు సేవ చేయడం కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పుడు ప్రజల మధ్య ఉండాలని ఆదేశించారు. వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ప్రజలకు అధికారులకు మధ్య వారధులుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో హరిబాబు, అర్బన్ సీఐ సుబ్బారెడ్డి, రేణిగుంట పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, కరకంబాడి సర్పంచ్ ఈశ్వరమ్మ, కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, రేణిగుంట సర్పంచ్ నాగేషం, మండల మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, వైకాపా పట్టణ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, సైకిల్‌షాపు అలీ, వైకాపా నేతలు రామ్మోహన్, రమేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకన్నలి అంగన్‌వాడీ టీచర్ మృతి

తొట్టంబేడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త
మండలంలోని పెద్దకన్నలి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తున్న సిద్దాగుంట.ఉషారాణి అనారోగ్యంతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. ఎంతో నిబద్ధతతో పనిచేసే ఉషారాణి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం స్వగృహానికి చేరుకున్న ఆమె మృతదేహానికి వైస్ ఎంపిపి మల్లికమ్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యకర్తలు ఆమె మృతిపట్ల సిడిపిఓ ఫర్జానా, పలువురు గ్రామస్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు, యూనియన్ నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

కార్తీక వనభోజనాలు సందడి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 30 ప్రభాతవార్త
కార్తీకమాసం ఎంతో పవిత్రమైంది. ఈమాసంలో వనభోజనాలను ఉసిరిచెట్టుకింద చేస్తే ఎంతో మంచిదని పురాణగాథ కూడా ఉంది. ఈనేపథ్యంలో జూలుగంటి సత్యనారాయణశ్రేష్ఠి వారి కుమారుడు జూలుగంటి మురళీ దంపతులు తమ ఉద్యానవనంలో ఉసిరిచెట్టుకింద శివకేశవుల ప్రతిమలను దివ్యంగా అలంకరించి కార్తీకదీపాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులతో పాటు బిజెపితిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప కార్తీక వనభోజనాలలో పాల్గొని సాలగ్రామ శివలింగానికి ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యమహిళలు పాల్గొని ఉసిరిచెట్టుకింద దీపాలను వెలిగించి మొక్కులుతీర్చుకున్నారు.

మనిషి మానసిక అవసరాలను తీర్చే సాధనం 'గీతం'

- సీనియర్ జడ్జీ డా.ఐ.కరుణకుమార్

చిత్తూరురూరల్, అక్టోబరు 30 ప్రభాతవార్త:
మనిషి మానసిక అవసరాలను తీర్చే సాధనం గీతమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డా.ఐ కరుణకుమార్ అభిలాషించారు. స్థానిక ఓటికె రోడ్డులోని రెడ్డి భవన్‌లో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య వ్యవస్థాపకులు మర్రిపూడి దేవేంద్రరావు కలం నుంచి జాలువారిన రాగసుధ పుస్తకాన్ని జడ్జి కరుణకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ గీతానికి ప్రకృతే ప్రాణమని అయితే మనిషిలో దాగివున్న అచంచెల ఆత్మవిశ్వాసాన్ని పాట మాత్రమే మేలుకొలుపుతుందన్నారు. కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం డీన్, భాషా విభాగాల నిర్దేశకులు ఆచార్య ఎం.రామనాథం మాట్లాడుతూ న్యాయం కోసం ప్రజాపోరాటం సల్పితే ఆత్మవిశ్వాసానికి గీతం దర్పణం పడుతుందన్నారు. అనంతరం ఆచార్య ఎం.రామనాథంనాయుడికి పుంభావ సరస్వతిబిరుదును దేవేంద్రరావు, ప్రముఖ సాహితీవేత్త దేవేంద్రరావుకు అభినందన పత్రాన్ని ఆచార్యనాయుడు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జాతీయ అధ్యక్షులు డా.సి.నారాయణస్వామి, గౌరవాధ్యక్షులు డా. నందిపాటి చక్రపాణి, సంఘసేవకులు నూకతోటి రాజేష్, సాహితీవేత్తలు, సంఘసేవకులు పార్థసారథినాయుడు, కొరూరి వెంకటరత్నం, డా.జి. శాంతకుమారి, తోట గోవిందన్, ఎం. నేతాజీ, హరిప్రసాద్‌రెడ్డి, పి.ఆర్.జ్ఞానశేఖర్‌రెడ్డి, రోహిత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

నాలుగు దశాబ్దాల విరామ కలయిక

చంద్రగిరి, అక్టోబర్ 30 ప్రభాతవార్త:
తమకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థితికి దోహదపడిన తమ పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఇతోధిక వితరణ చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1979-80 మధ్యన 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. దాదాపు ఆరు పదులు దాటిన వయస్సులో చిన్నపిల్లల వలే ఒకరినొకరు పలకరించుకున్న తీరు నేటి తరం ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలో తమ పాఠశాలకు రూ.50 వేలు విలువైన ఎలక్ట్రానిక్ పోడియం, ఎలక్ట్రానిక్ బెల్, హాకీ స్టిక్స్ 20, హాకీ బాల్స్ 20 వితరణ చేశారు. పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందించడంలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎల్ జానకిరామయ్య, భరణీనాథ్ రెడ్డి, దినకర్ రెడ్డి, బాలాజీ నాయుడ, ఒరుగొండ బాబు, ధనంజయ, సాంబశివరెడ్డి, బాబు, ఉమామహేశ్వర్, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని పివి రోడ్డులో వెలసిన అంకాళమ్మ దేవస్థానంలో ఆదివారం స్కందషష్ఠి పూజలు ఘనంగా నిర్వహించారు.పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ధార్మికత వెల్లివిరుస్తుందన్నారు.ఆర్‌టిసి బస్టాండు సమీపంలో మరాఠి పాళెంకు చెందిన గోవర్ధన్‌రావు,యశ్వంతరావుల సారధ్యంలో అన్నదానం ఏర్పాటు చేసారు. వందలాది మంది పేదలకు మధ్యాహ్నం ఆలయం వద్ద భోజనాలు అందించి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమాలకు సుశీలబాయి,లక్ష్మీబాయి, క్రాంతి కుమార్, డాక్టర్ కృపా నిధి, రాజేశ్వరరావు, రాఘవేంద్ర, గణేష్ బాబు, వినీతరెడ్డి బాజ్జీరావు, అనూష, షర్మిళ,శ్రీరామ్, అరుణ్, శివకుమార్,మయూర్ ప్రసన్న, కార్తీకేయన్,చేతలి శర్మలు సహకరించారు.వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అటు భక్తులకు నీడ:పక్కనే ఆక్రమణల జాడ

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం గిరిప్రదక్షిణకు సంబంధించి స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సూచలతో రూ.18కోట్లతో 21 కిలోమీటర్ల సిమెంటు రోడ్డును నిర్మించారు. అయితే రోడ్డు ఏర్పడటంతో కైలాసగిరుల్లోని ఎర్ర గ్రావెల్‌ను విచ్చల విడిగా తరలిస్తున్నారు.ఈ నేపథ్యంలో పట్టణానికి సమీపంలోని రామచంద్రాపురం గ్రామం వద్ద ఏడాదిలో ఒరెండు సార్లు వచ్చే స్వామి అమ్మవార్ల విడదికి చక్కటి షెడ్డును నీడ కోసం నిర్మిస్తుంటే షెడ్డుకు సమీపంలో చక్కగా ఓ గదినిర్మాణం యుద్ధ ప్రాతిపదికపై రాత్రికి రాత్రి పనులు చక చకా సాగుతున్నాయి.అయితే ఇవేమి పట్టనట్లు దేవస్థానం వ్యవహరిస్తుంది. ఇప్పటికైనా పోయింది పోగా మిగిలిన భూముల్ని అయినా కాపాడే దిశగా అధికారులు స్పందిస్తే బాగుంటుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

పంగూరులో ఉచిత కంటి వైద్యశిబిరం

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త
శ్రీకాళహస్తికి సమీపంలోని ఏర్పేడు మండలం పంగూరు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పంగూరు సచివాలయం పరిధిలోని మూడు పంచాయతీల పరిధిలోని ప్రజలకు ఉచిత కంటి వైద్యపరీక్షలు జరిపారు. తిరుపతిలోని వెన్నెల కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రసన్న కుమార్ పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహించారు.ఇక్కడ గడప గడపకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వెళ్లినపుడు అక్కడి ప్రజల స్థితిని గమనించిన ఆయన వెంటనే కంటి వైద్యులతో సంప్రదించారు. ఆదివారం శిబిరాన్ని మండల వైకాపా ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి పర్యవేక్షించారు. సర్పంచ్ గాది రాజేశ్వరి,పాలేటి లక్ష్మీ ప్రసన్న,బోర్రానారాయణలు సహకరించి వైద్యపరీక్షలు జరిపించుకునే వారిని శిబిరానికి తరలించారు.ఇక్కడ 254 మందికి వైద్యపరీక్షలు జరుపగా 102 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసారు. వారికి త్వరలోనే ఆపరేషన్లు జరిపి ఉచితంగా కంటి అద్దాలు అందిస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమాల్లో ఏర్పాట్లను సర్పంచ్‌ల సంఘాధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, చెన్నూరు పెంచులయ్య పర్యవేక్షించారు.ఈ శిబిరంతో తమ పంచాయతీల్లోని ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని శిబిరాన్ని ఏర్పాటు చేసిన శాసనసభ్యునికి ధన్యవాదాలు తెలిపారు.

ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ పోస్టుల నియామకాలను నిలపండి

తొట్టంబేడు, అక్టోబర్30 ప్రభాతవార్త

మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్‌ల పోస్టుల నియామకభర్తీని కొద్దిరోజులు ఆపాలని కోరుతూ ప్రాజెక్టు కార్యాలంలో సూపర్‌వైజర్‌కు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలైన తాము సెప్టెంబర్ 18వతేదీన గ్రేడ్-2 సూపర్‌వైజర్ పరీక్షలు రాసి మెరిట్‌లిస్ట్‌లో ఉన్నామని పరీక్ష విషయంలో కొంతమంది తమకు వ్యతిరేఖంగా కోర్టుకు వెళ్ళినారని దీంతో ఈనెల 18వతేదీన కోర్టులో జరిగిన వాదోపవాదం ఫలితంగా కర్నూలు జోన్‌కు తప్ప మిగిలిన జోన్‌లలో సూపర్‌వైజర్‌ల నియామక ప్రక్రియను కొనసాగించవచ్చని న్యాయస్థానం పేర్కొందన్నారు. కర్నూలు జోన్‌కు కూడా ఈనెల చివరిలో తుదిఫలితం వచ్చే వరకు ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్‌ల నియామకాలను ఆపవలసినదిగా కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

నింద్ర, అక్టోబరు 30 ప్రభాతవార్త :
మండలంలో అదివారం నెట్టేరి దళితవాడలో వైకాపా యువజన నాయకుడు గోపిక్రిష్ణ ఆద్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో యస్‌సి,యస్‌టి,బిసి,మైనార్టీలకు చెందిన ప్రజలు ఎక్కువ మంది వున్నారని వారంత చాలా మంది పేద ప్రజల కాబట్టి వారికి ఉచితంగా వైద్యసహాయం అందించడం సంతోషించదగినదని తెలిపారు.ఉచిత వైద్య సహాయం అందించడానికి ముందుకు వచ్చిన తిరుపతి మాధురి రెమిడి ఆసుపత్రి వారిని అభినందించారు. కార్యక్రమంలో అర్థోపిడ్ యన్‌యం కుమార్,జనరల్ మెడిసిన్ శ్రీధర్,వినిత్,యంపిపి దీపాజలంధర్‌రాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,నాయకులు వీరయ్యనాయుడు,దామోధరం,సుధాకర్,రామచంద్రారెడ్డి,సత్యరాజ్,తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవానికి తరలిరండి..!

ప్రతాప్ స్వామీజీ

రామచంద్రాపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త:
యోగుల పర్వతంపై నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి భక్తులు తరలిరావాలని ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ పిలుపునిచ్చారు. వెయ్యి కేజీలు నెయ్యి, వెయ్యి మీటర్ల వత్తికి యోగుల పర్వతం దిగువ భాగాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలినడకన మోసుకుని వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమ పవిత్రమైన దీపారాధన చేయడం ఎంతో ఉన్నతమైనది అన్నారు. దీపారాధన సమయంలో 20 కేజీలకు పైగా కర్పూరాన్ని వినియోగించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

పొట్టేలు దొంగలను గుర్తించి న్యాయం చేయండి..!

పోలీసులకు ముంగిలిపట్టు బాధితుడి ఫిర్యాదు

చంద్రగిరి, అక్టోబర్ 30 ప్రభాతవార్త:
అర్ధరాత్రి మా పొట్టేలును దొంగతనం చేసిన నిందితులను పట్టించి న్యాయం చేయాలని కోరుతూ ముంగిలిపట్టుకు చెందిన వడ్లమూడి సురేష్ నాయుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. ముంగిలిపట్టులోని తమ ఇంటికి సమీపంలోని ఓ షెడ్డులో మేకపోతులు, పొట్టేలును పెంచుకుంటున్నట్లు పేర్కొన్నారు. శనివారం రాత్రి యధావిధిగా మేకలను, పొట్టేలును షెడ్డులోవేసి ఇంట్లో నిద్రించినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం షెడ్డులో చూడగా రూ.20 వేలు విలువ చేయగల ఒక పొట్టేలు కనబడలేదన్నారు. మా గ్రామంలోని ఒకరి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న సిసి కెమెరాలను పరిశీలించగా ముగ్గురు దొంగలు బైక్‌పై వచ్చి పొట్టేలును దొంగతనంగా తీసుకెళ్ళడాన్ని గుర్తించామన్నారు. ఆ మేరకు వీడియో క్లిప్పింగ్‌లను అందించిన బాధిత రైతు నిందితులను అరెస్ట్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటు చాలా కీలకమైనది

- కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా

రేణిగుంట, అక్టోబరు 30 ప్రభాతవార్త:

మేధావులను రాజ్యసభకు పంపే అత్యంత కీలకమైనది ఎమ్మెల్సీ ఓటు అని వైకాపా సీనియర్ నేత కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా అన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, రేణిగుంట మండల వైకాపా ఇన్‌చార్జి బియ్యపు పవిత్రరెడ్డి సూచన మేరకు ఆదివారం మైనారిటీ నేతలు పట్టణంలో పలు ప్రాంతాల్లో తిరిగి పట్టభద్రులను గుర్తించి వారిని ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ప్రోత్సహించారు. వందల సంఖ్యలో పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను మైనారిటీ నేతలు వారికి వివరించారు. ఈ సందర్భంగా మైనారిటీ నేత సుభాన్‌రాజా మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు ఆషామాషీ కాదని చాలా కీలకమైనదిగా తెలిపారు. మేధావులను రాజ్యసభకు పంపే అమూల్యమైన ఓటు అన్నారు. పట్టభద్రులకు అవగాహన కల్పించిన వారిలో మండల పార్టీ మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, సైకిల్ షాపు అలీ, పలువురు మైనారిటీ నేతలు ఉన్నారు.

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోంది

- బీజేపీ జిల్లా నేత డాక్టర్ చంద్రప్ప

రేణిగుంట, అక్టోబరు 30 ప్రభాతవార్త:

భారత ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో తిరుపతి పార్లమెంట్ బీజేపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప అన్నారు. రేణిగుంట మండలం వెదళ్ళ చెరువు మాజీ సర్పంచ్ నాగ మునెమ్మ ఇంట్లో ఆదివారం డాక్టర్ చంద్రప్ప ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. అనంతరం ఆయన బీజేపీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలసి ప్రధానమంత్రి అభివృద్ధి పనులను, ప్రణాళికలను ప్రజలకు వివరించారు. భారతదేశం వైపుకు చూడాలంటేనే శత్రుదేశాలకు వణుకు పుట్టిస్తున్న గొప్పయోధునిగా మోదీని అభివర్ణించారు.

మండలంలోని పర్యటించిన టీడీపీ నాయకులు

కేవీబీ పురం, అక్టోబరు 30 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, సత్యవేడు జేడీ రాజశేఖర్ ఆదేశాల మేరకు కేవీబీ పురం మండలం అడహక్ కమిటీ సభ్యులు గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రాయపేడు గ్రామ పంచాయతీలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు నమోదు గురించి అవగాహన కల్పించి, ఓటు నమోదుకు సమయం తక్కువుగా ఉన్నందున త్వరగా చేరాలని పట్టభద్రులకు సూచించారు. కార్యక్రమంలో కేవీబీ పురం మండల అడహక్ కమిటీ సభ్యులు రామాంజులనాయుడు, కనపర్తి గోపినాథ్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ ప్రధాన కార్యదర్శి, రాయపేడు సర్పంచ్ బాలాజీ, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు రామచంద్రయ్య, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, రైతు విభాగ అధ్యక్షుడు వెంకట్రామయ్య యాదవ్, గురునాథం యాదవ్, మనోహర్ యాదవ్, చంద్రయ్యనాయుడు, మునికుమార్ యాదవ్, పరందామయ్య, నాగరాజురెడ్డి, చక్రపాణి, సుబ్రహ్మణ్యం, సురేష్‌వర్మ, ప్రశాంత్‌వర్మ, గోవిందరెడ్డి, జగ్గయ్య, రాజేంద్ర పాల్గొన్నారు.

రైతులకు భూమి పాస్‌పుస్తకాలు అందించండి

కేవీబీ పురం, అక్టోబరు 30 ప్రభాతవార్త:
గత ఒక సంవత్సరంగా ఎదురుచూస్తున్న ఇంత వరకు పాసు పుస్తకాలు అందలేదని రైతులు వాపోతున్నారు. కేవీపీ పురం మండలంలో సుమారు 300 మంది రైతులు వారి అనుభవంలో ఉన్న భూమి పాసు పుస్తకాలు కొరకు మీసేవా, సచివాలయాల్లో ఆన్‌లైన్‌లోఎక్కించి సంబంధించిన డాక్యుమెంట్లను వీఆర్‌వో, ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్ అందరూ కార్యాలయం నుంచి ఇన్‌స్పెక్షన్‌చేసి భూమి వివరాలు నమోదు చేసి వ్యక్తిగత భూమి పాసు పుస్తకాల కొరకు చెన్నైలోని కార్యాలయంలో ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. సంవత్సరాల తరబడి తిరిగితే భూమి పాసు పుస్తకాలు లెక్కలు ఆన్‌లైన్‌లో ఎక్కించిన తరువాత పాసు పుస్తకాల కొరకు చెన్నైకి ప్రింటింగ్ ప్రెస్‌కు పంపామని, అవి రావడానికి ఇంకా సంవత్సరం పడుతుందని అధికారులు తెలుపుతున్నారు. జగన్ ముఖ్యమంత్రి రైతుల పట్ల ఎంతోఉత్సాహంతో వివిధ రకాల ప్రభుత్వ లబ్ధిలు అందిస్తున్నారు కానీ ఇంత వరకు కేయూ పురం మండలంలో సుమారు 300 మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెన్నైలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌లోఉన్న భూమి పాసు పుస్తకాలు తక్షణం అందించే విధంగా పంపిణీకి సిద్ధం చేయాలని రైతులు వాపోతున్నారు.

గంగపల్లికి ఘన నివాళులు

చంద్రగిరి, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

టిడిపి మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని ఆదివారం టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దివం గత గంగపల్లి భాస్కర్ సంస్మరణ కార్యక్రమంలో ఘన నివాళు లర్పించారు. ఇందులో భాగం గా చంద్రగిరి పాతపేటలోని గంగపల్లి భాస్కర్ నివాసానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా తాము అండగా నిలుస్తామంటూ ఆత్మస్థైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, సీనియర్ నాయకుడు మొక్కల కుమార్‌రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలువ భూమి కబ్జా .. సిసి రోడ్డు నిర్మాణం

చంద్రగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త:
తిరుపతి రూరల్ మండల పరిధిలోనిదిగా భావిస్తున్న కాలువ పొరంబోకు భూమిని ఆక్రమించి సొంత స్థలాలు విక్రయించడం కోసం సిసి రోడ్డు నిర్మిస్తున్నప్పటికీ రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. తొండవాడ ముక్కోటి సమీపంలో గల పిఎల్‌ఆర్ క్యాండీ హోటల్ ఎదురుగా కాలువ పొరంబోకు భూమిలో ప్రైవేటు వ్యక్తులు సిసి రోడ్డు నిర్మిస్తున్నారు. అయితే రెవెన్యూ అధికారులు ఈ భూమి తిరుపతి రూరల్ మండల పరిధిలో

ని వస్తుందని అంటున్నారు. వాస్తవానికి వర్షాకాలం, అకాల వర్షాలతో వరదలు సంభవిస్తే ఈ మార్గంలోనే నీరు ప్రహించాల్సి వున్నది. ప్రక్కనే కల్వర్టు వున్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా సొంత స్థలాలు విక్రయించుకునేందుకై కాలువ భూమి కబ్జా చేసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై రెవెన్యూ విభాగం విమర్శలు, ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇక్కడ కాలువ ఎంత వున్నదీ, ఏ మేరకు ఆక్రమణకు గురైనది పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పుట్‌పాత్‌లే ఇక పార్కింగ్ స్థలాలు!

-వాహనాలకు అనువుగా పనులు

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
రోజుకు లక్షమంది వరకు భక్తులు....15వేలకుపైగా యాత్రీకుల వాహనాలు.....వెరసి చాలీచాలని పార్కింగ్ స్థలాలతో కొండపై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఒకచోట గాదు...కొండపై అనేక ప్రాంతాల్లో భక్తుల వాహనాలకు సరైన పార్కింగ్ లేదు...ఉన్నస్థలాల్లో 8వేల వరకు వాహనాలు పార్కుచేస్తే మిగిలిన వాహనాలన్నీ రోడ్లపై, కాటేజీల వద్ద ఎక్కడబడితే అక్కడ నిలిపి భక్తులు స్వామివారి దర్శనానికి వెళ్ళిపోతున్నారు. ఈ కారణాలతో యాత్రికుల వాహనాలకు కొంత ఇబ్బందికరంగా మారింది. భక్తులు కూడా అడ్డదిడ్డపార్కింగ్‌తో అవస్థలు పడుతున్నారు. కొండపై భక్తుల వాహనాలతో బాటు టిటిడి ఉద్యోగుల వాహనాలకు సరైన పార్కింగ్ సదుపాయం లేదు. దశాబ్ధకాలం క్రిందట పార్కింగ్‌కోసం మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని అప్పటి టిటిడి బోర్డు ప్రతిపాదనలు రూపొందించింది. ఈ ప్రతిపాదనలు ఆ తరువాత కార్యరూపం దాల్చలేదు. దీంతో ఏళ్ళ తరబడి కొండకు వచ్చిన భక్తుల వాహనాలకు పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టిటిడి పెద్దలు. అధికారులు తిరుమలలో భక్తుల వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలనే ఉద్దేశ్యంతో సామాన్యభక్తులు బసచేసే కాటేజీల సమీప ప్రాంతాల్లో యాత్రికులు నడిచేందుకు నిర్మించిన పుట్‌పాత్‌లను పగలగొట్టి పార్కింగ్‌కు స్థలాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇలా ముఖ్యంగా ఎస్ఎన్‌సి, ఎస్ఎంసి ,హెచ్‌విసి ప్రాంతాల్లో ఈ పనులు మొదలయ్యాయి. కాటేజీల ముందు ఉన్న పుట్‌పాత్‌లను తొలగించి ఆ స్థలాల్లో కొంతవరకు సిమెంట్ రాళ్ళను అమర్చి పార్కింగ్‌కు అనువుగా మార్పుచేస్తున్నారు. ఈ పనులు వల్లయాత్రికులకు కొంత అసౌకర్యం

ఎదురవుతోంది. ఇలా చేయడం వల్ల ఎక్కడ భక్తులు అక్కడ కాటేజీల స్థలాల్లోనే వాహనాలను పార్కింగ్ చేసుకునే వెసలుబాటు కలుగుతుంది. కొంత ఎత్తుగా తీర్చిదిద్ది సిమెంట్ రాళ్ళపై వాహనాలను ఆపేందుకు వీలుగా తీర్చిదిద్దుతూన్నరు. దీనిపై పలువురు భక్తులు కూడా సంతృప్తి చెందుతున్నారు.

శ్రీవారి ఆశీస్సులు కోరాం
-తిరుమలలో ప్రముఖులు

తిరుమల,అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:
రాష్ట్రంలో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, అందరికీ స్వామివారి ఆశీస్సులు కలగాలని దేవుడ్నిప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల్లో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపి సిఎం రమేష్ తిరుమలకు చేరుకుని వెంకన్నను దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

బొప్పరాజుపల్లిలో జల్లికట్టు

రామచంద్రాపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త: బొప్పరాజుపల్లిలో ఆదివారం జల్లికట్టు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం యువకులు పశువులను అందంగా అలంకరించారు. కొయ్యి చెక్కతో చెక్కిన పలకలకు రంగురంగు కాగితాలను అతికించి సుందరంగా తయారు చేశారు. పలకలను, నూతన వస్త్రాలను పశువుల కొమ్ములకు కట్టి డప్పులతో బెదిరించారు. పశువులకు కట్టిన బహుమతులను సొంతం చేసుకోవడానికి యువత పోటీ పడ్డారు. జల్లికట్టు సంబరాలు ప్రారంభమైన కొద్ది సమయానికే ఎస్ఐ గిరిబాబు బొప్పరాజుపల్లికి చేరుకుని జల్లికట్టు నిర్వహించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. దీంతో జల్లికట్టు సంబరాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

108 అంబులెన్స్‌లో కాన్పు
పండంటి ఆడపిల్లకు ప్రాణం

చంద్రగిరి, అక్టోబర్ 30 ప్రభాతవార్త:
చంద్రగిరి 108 అంబులెన్స్‌లో అత్యవసరంగా నొప్పులతో ఇబ్బంది పడుతున్న మహిళకు ఈఎంటి రాజ్యలక్ష్మి కాన్పు చేసి పండంటి ఆడపల్లకు ప్రాణం పోసిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. స్థానిక సప్తగిరి నగర్ (జోగల కాలనీ) కి చెందిన గర్భవతి శోభను తన భర్త బాబు కాన్పు కోసం 108 ద్వారా తిరుపతిలోని మెటర్నటీ ఆసుపత్రికి వెళుతుండగా పురిటి నొప్పులు తీవ్రం కావడంతో రాజ్యలక్ష్మి తన వాహనంలోనే కాన్పు చేశారు. కూతురు జన్మించడంతో తల్లిదండ్రులు ఆనందంతో 108 సిబ్బంది ఈఎంటి రాజ్యలక్ష్మి, ఫైలెట్ వేణుగోపాల్ రెడ్డిలకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.

పంటపొలాల్లో భారీ కొండ చిలువ హల్‌చల్ !!

కుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త
గుడుపల్లె - మిట్టూరు గ్రామాల మధ్య ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని పంట పొలాల్లో ఆదివారం ఓ కొండ చిలువ హల్‌చల్ చేసింది. పొలాల మధ్య కొండ చిలువ పడుకుని ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన యువత కొండ చిలువను పట్టేసి ఓ సంచిలో వేసి దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో వదిలేయాలని తీసుకెళ్లారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజాస్వామ్యం పరిరక్షణే ధ్యేయం

-ఆత్మగౌరవ ర్యాలీ కాదు...వైకాపా బలవంతపు బల ప్రదర్శన
-పూర్వ ప్రజారాజ్యం పార్టీ మిత్రుల 'ఆత్మీయ కలయిక'
-వూకా విజయకుమార్, సైకం జయచంద్రారెడ్డి, కిరణ్‌రాయల్

తిరుపతిరూరల్, అక్టోబర్30 ప్రభాతవార్త:
ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం ప్రతిపక్షాలన్ని మిత్ర పక్షాలై ఎదురొడ్డి పోరాడాలని పూర్వ ప్రజారాజ్యం పార్టీ నాయకులు వూకా విజయకుమార్, కిరణ్‌రాయల్ తదితరులు పిలుపు నిచ్చారు. ఆదివారం తిరుపతిరూరల్ సంస్కృత నగర్‌లోని ఓ కళ్యాణ మండపంలో పూర్వ ప్రజారాజ్యం పార్టీ మిత్రుల 'ఆత్మీయ కలయిక' జరిగింది. ఈ కలయికలో వూకా విజయకుమార్ మాట్లాడుతూ పూర్వ ప్రజారాజ్యం పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ఏర్పడి, ఇతర పార్టీ నాయకులకు కలుపుకుని ప్రభుత్వంపై ఎదురుభావుటా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం పరిరక్షనే ధ్యేయంగా టిడిపి, జనసేన, కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, సిపిఎం పార్టీలన్ని ఏకం కావాలని పిలుపునిచ్చారు. అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో దౌర్జాన్యాలు, దోఫిడి, ఆగయత్యాలు, కబ్జాలు ఎక్కువైనాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువైనాయని ఆవేదన వ్యక్తం చేసారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా కలిసికట్టుగా పని చేయాలన్నారు. శనివారం తిరుపతి జరిగిన రాయలసీమ ఆత్మగౌరవ ర్యాలీలో బలవంతంగా స్కూల్ పిల్లలను, పొదుపు సంఘాలను, వాలంటీర్లు, ఇతర సంఘాలను బందీలుగా బలవంతగా ర్యాలీకి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆత్మగౌరవ ర్యాలీలో స్వచ్ఛంధంగా ఏవరు పాల్గొనలేదని, బలవంతంగా బల ప్రదర్శన చేసారని ఏద్దేవ చేసారు. సీనియర్ నేత సైకం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పూర్వ ప్రజారాజ్యం నాయకులందరూ ఒకచోట కలవడం ఆనందంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ కలిసి పని చేయాలని సూచించారు. పిఆర్పీ నాయకులు కిరణ్‌రాయల్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సి అవసరం ఉందన్నారు. ప్రధాన పార్టీలు ఏకమై సమిష్టిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తిరుపతిలో భూ కబ్జాలు ఎక్కువైనాయని, పాలన గాడి తప్పిందని, రాష్ట్రంలో తిరిగి సుపరిపాలన కొనసాగాలంటే పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పూర్వ ప్రజారాజ్యం పార్టీలో ఉన్న నాయకులు అందరూ కలిసి ఓ నిర్ణయం తీసుకుని ప్రభుత్వంపై సమిష్టిగా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ముక్కు సత్యవంతుడు, చిన్నంగారి రమణ, అశోక్ సామ్రాట్ యాదవ్, రాజారెడ్డి, అబ్దుల్, మునిసుబ్రమణ్యం, డాక్టర్ సురేంద్ర శెట్టి, లత, సరితా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో కాన్పు
పండంటి ఆడపిల్లకు ప్రాణం

వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సూర సంహారం

పుత్తూరురూరల్, అక్టోబరు 30 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం తిరుపతి రోడ్డులో వెలసిన శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 96వ సంవత్సరం స్కంధ షష్టి సందర్భంగా ఆదివారం ఆలయంలో సూరసంహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు మహాభిషేకం ప్రత్యేక అలంకరణలు, అర్చనలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లు మయూరి వాహనంపై ఊరేగింపు సుర సంహారం కార్యక్రమాలు నిర్వహించారు. 31వ తేదీ సోమవారం ఉదయం అభిషేకాలు, అలంకరణలు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం కల్యాణోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుందరం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం

కారు ప్రమాదం ఐదుగురికి గాయాలు



కల్వర్టు గుంతలో పడ్డ కారు

పెద్దపంజాణి, అక్టోబర్ 30 ప్రభాతవార్త :
చౌడేపల్లి -పలమనేరు రహదారిలో పెద్దపంజాణి మండలం మంగంపల్లి సమీపంలో రోడ్డు కల్వర్టు నిర్మాణ పనుల నిర్లక్ష్యంతో ఓ కారు ప్రమాదానికి గురై ఐదుగురు గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. గత కొంతకాలంగా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా విస్తరణలో భాగంగా కల్వర్టు పనులు చేపట్టడం జరుగుతుంది. అయితే ఆ నిర్మాణ పనుల వద్ద ఎటువంటి ప్రమాదసూచిక బోర్డులు, లైట్లను సైతం ఏర్పాటు చేయకపోవడంతో మదనపల్లి నుండి చౌడేపల్లి మీదుగా కెళవాతికి వస్తున్న ఓ కారు రాత్రి వేళ కావడంతో ఎటువంటి సూచిక బోర్డులు లేక పోవడంతో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కారు రోడ్డు మధ్యలో నిర్మిస్తున్న కల్వర్టు గుంతలో పడటం జరిగింది. దీంతో కారులో ప్రయానిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. వీరిని స్థానికులు గుర్తించి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాహనదారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇకనైనా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న ఆ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా నిర్మాణ పనులు జరుగుతుందన్న ప్రమాద సూచిక బోర్డులు వేస్తే ప్రమాదాలు నివారించగలమని స్థానికులు సైతం సూచించడం జరుగుతోంది. ఇప్పటికైనా నిర్వాకులు ఆ బోర్డులను ఏర్పాటు చేస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది.

స్కందషష్టి సందర్భంగా ఆకాశదీపం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆదివారం సుబ్రమణ్యం స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలోనూ, అలాగే తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయంలో స్కందషష్టి సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో హాజరై పూజలు జరుపుకున్నారు. స్వామి వారిని షోడషాభిషేకాలు నిర్వహించారు. తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయంలో ప్రతి మంగళవారం, కృత్తిక, స్కందషష్టి సందర్భంగా విశేష పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆదివారం స్కందషష్టి సందర్భంగా షణ్ముఖ స్వామి ఆలయం భక్తులతో కిట కిట లాడింది. వందలాదిలీటర్ల పాలతోనూ, పన్నీరు, షోడషాభిషేకాలతో పునీతం చేసారు. ఇక అలంకారాలతో భక్తులను ఆకట్టుకున్నారు. నైవేద్య ప్రసాదాలను అందించారు.

ఆకాశ దీపం ఆవిష్కరణ:
శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం రద్దీ రోజు రోజుకు పెరుగుతుంది. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలలో స్థానిక భక్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా సాయంత్రం కోట మండపం వద్ద స్కందషష్టి సందర్భంగా ఆకాశదీపం ఆవిష్కరణను నిర్వహించారు, ఈ కార్యక్రమాల్లో దర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు వారి సహచరులు, ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు, డిఇఇ మురళీధర్‌రెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, సిబ్బంది, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

బైరాగి పట్టెడలో ఘనంగా ఓనం పండుగ ఉత్సవాలు

తిరుపతి ప్రెస్‌క్లబ్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

నగరంలోని బైరాగి పట్టెడలో కేరళ సమాజం తిరుపతి వారి ఆధ్వర్యంలో ఓనం పండుగ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, గౌరవ అతిథిగా తిరు పతి నగర మేయర్ డాక్టర్ శిరీష, ప్రత్యేక అహ్వానితులుగా బాలాజి నర్సింగ్ కాలేజి ఛైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్‌లు విచ్చేశారు. ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేరళ సమాజం తిరుపతి వారి ఆధ్వర్యంలో గత 15 ఏళ్ళుగా ఓనం పండుగని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ చూసినా నర్సింగ్ వృత్తిలో కేరళ నుంవి వచ్చిన మళయాలీలే వుంటారని, వారు ఎంతో నిబద్ధంతో పనిచేస్తారని తెలిపారు. డాక్టర్ ముని శేఖర్ యాదవ్, బాబూ నందకుమార్, కార్యదర్వి కెకె.మురళి, కోశాధికారి సిసి.నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాగన్ ఫ్రూట్ సాగుతో
లాభాల బాటలో రైతు

వడమాలపేట, అక్టోబరు 30 ప్రభాతవార్త:

ఒకేసారి పెట్టుబడి పెట్టి సాగు చేస్తే చాలు సుమారు 15 ఏళ్లు దిగుబడిని ఇచ్చే డ్రాగన్ ఫ్రూట్‌తో మంచి లాభాలు పొందవచ్చునని రైతులు అంటున్నారు. ఔషధ గుణాలు మెండుగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్‌కు మంచి గిరాకీ ఉందని తెలుసుకున్న ఏఎం పురం రైతు రాజేంద్ర కుమార్‌వర్మ రెండేళ్ళ క్రితం బెంగళూరు నుంచి మొక్కలు తీసుకువచ్చి హెక్టారు పొలంలో సాగు చేశారు. ఎకరాకు 5 లక్షల రూపాయలు వరకు ఖర్చు చేశారు. రెండేళ్ళలో పది లక్షల వరకు లాభం వచ్చినట్లు రైతు తెలిపారు. మంచి లాభాలు వచ్చే ఈ పంటను ఎక్కువ మంది రైతులు సాగు చేసి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వం రాయితీ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

డ్రాగన్ ఫ్రూట్ సాగు విధానం

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అన్ని రకాల నెలలు అనుకూలమే. మిట్ట ప్రాంత భూముల్లో ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. ఎకరా విస్తీర్ణంలో ఈ పంట సాగు చేయాలంటే సుమారు 500 సిమెంటు స్తంభాలు అవసరమవుతాయి. ఒక్కొక్క స్తంభం చుట్టూ నాలుగు మొక్కలు వంతున రెండు వేల మొక్కలు నాటుకోవచ్చు. సేంద్రియ ఎరువుల, నీటి తడులు సక్రమంగా వాడుకుంటే 9 నెలలకు కాపుకు వస్తాయి. ఏడాదికి నాలుగు కాపులు వస్తాయి. ఎకరాలో ఒక్కొక్క కాపుకు కనీసం అర టన్ను పండ్లు దిగుబడి వస్తుంది. తిరుపతి, చెన్నై, మార్కెట్‌ల్లోకి కేజీ పండ్లు రూ.180 నుంచి 200 వరకు ధర పలుకుతుంది. మూడు, నాలుగేళ్ళ తరువాత దిగుబడి రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రయోగాత్మకంగా సాగు చేశా : రాజేంద్రకుమార్‌వర్మ

మామిడి పంట వల్ల ప్రయోజనం లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా డ్రాగన్ మొక్కలు బెంగళూరు నుంచి ఒక మొక్క 80 రూపాయల లెక్కన రెండు వేల మొక్కలు తెప్పించి నాటాను. 9 నెలలకు కాపుకొచ్చింది. తొలి రెండు కాపులు దిగుబడి తక్కువగా వచ్చినా ఆ తరువాత నుంచి మంచి దిగుబడి వస్తోంది. సంవత్సరానికి సుమారు 5 లక్షల రూపాయలు వరకు మిగులుతుంది.

మహిమాన్వితుడు అర్ధనారీశ్వరుడు

-నేడు ఆలయంలో ప్రత్యేకపూజలు

తొట్టంబేడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త
హరుడు, భవహరుడు, భక్తవశంకుడు, మూగజీవులకు ముక్తిని ప్రసాదించిన ముక్కంటీశుడు శ్రీకాళహస్తీశ్వరుడు. ఎంతో పవిత్రపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పరమేశ్వరుడు స్వయంభువుగా వాయులింగ రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నాడు. తన శరీరంలో అర్ధభాగాన్ని పార్వతీదేవికి ఇచ్చిన పరమశివుడు అర్ధనారీశ్వరునిగా వెలిశాడు. ఈరూపాన్ని లింగాకారంగా మార్చి సువర్ణముఖినదీ తీరాన శ్రీకాళహస్తిలోనే ఆ ఆదిదంపతులు కొలువై భక్తులకు కోరిన వరాలిస్తున్నారు. ఇక్కడికి మరొకొద్ది దూరంలో ఈసలాపురం(విశాలపురం) గ్రామంకు సమీపం సువర్ణముఖి నదిలో అర్ధనారీశ్వరుడు కొలువై ఉన్నాడు. ఎంతో మహిమాన్వితంగా పిలువబడే దేవదేవుడు పరమేశ్వరుడు ఇక్కడ అర్ధనారీశ్వరుడుగా ఉన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా వెలసి ఆలయంలో స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటే కష్టాలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో వెలసిన శివలింగాన్ని పరిశీలించినట్లయితే ముందుస్వామి వారు, వెనుకభాగంలో అమ్మవారు మనకు దర్శనం ఇస్తారు. అమ్మవారు రూపాన్ని చూడాలంటే వెనుకవైపు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అద్దంలో అమ్మవారిని చూడవచ్చును. ఒక్కసారి ఆలయ పరిసరాలను పరిశీలించినట్లయితే ఆలయంలో అడుగుపెట్టగానే నందీశ్వరుడు దర్శనమిస్తారు. గర్భగుడి ఇరువైపులా వినాయకుడు, సుబ్రమణ్య



స్వామి విగ్రహాలు ఉంటాయి. రాహుకేతు క్షేత్రంగా విరాజిల్లుతోన్న శ్రీకాళహస్తిలో వెలసిన రాహుకేతువులు విగ్రహరూపంలో భక్తులకు ఇక్కడ దర్శనమిస్తారు. ఆలయంలోకి అడుగుపెట్టగానే ఇక్కడ సుబ్రమణ్యస్వామి విగ్రహం పక్కనే ఉన్న చిన్నగూటిలో మనకు రాహుకేతువులు కనిపిస్తాయి.

ఆలయ పురాణగాథ ఇదే..
తన శరీరంలో అర్ధభాగాన్ని పార్వతీదేవికి అర్పించిన పరమేశ్వరుడు అర్ధనారీశ్వరునిగా వెలిశాడు. ఆకాశమార్గంలో విహరిస్తున్న శివపార్వతులు శ్రీకాళహస్తి క్షేత్రంలోకి రాగానే అలసిపోయారు. విశ్రాంతి తీసుకుందామని శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఐదు కిలోమీటర్ల దూరంలో స్వర్ణముఖి నదితీరం వద్ద గల తపోవనంలో విడిదిచేశారు. విరూపాక్ష మహాముని తపస్సు చేసే ఈప్రాంతంలో విశ్రాంతి కోసం వచ్చిన శివపార్వతులు ఒకే లింగంలో లింగాకారంలో విగ్రహంగా కొలువుదీరారు. అర్ధనారీశ్వరునిగా వెలసిన శివపార్వతులు తమకు పూజలు చేసే భాగ్యాన్ని విరూపాక్ష మహామునికి అప్పగించారు. నాటి నుంచి ఇక్కడ అర్ధనారీశ్వరులుగా ఆదిదంపతులు పూజలందుకుంటున్నారు. ఇక సూర్యోదయం సమయంలో సాక్షాత్తు సూర్యభగవానుని కిరణాలు ఆలయంలో అర్ధనారీశ్వరిగా వెలసిన ఆదిదేవత వైపు సోకడం విశేం. సూర్యాస్తమయంలో పరమేశ్వరునివైపు సూర్యకిరణాలు తాకుతాయి. మరో అద్భుతం ఏమంటే ఇక్కడి ఆలయం ప్రహరీగోడలపై నల్లటి సాలెపురుగులు దర్శనమిస్తాయి. అయితే ప్రస్తుతం ఇవికనుమరుగయ్యాయి. శ్రీ-సాలెపురుగు, కాళ-పాము, హస్తి-ఏనుగులు కలసి పరమేశ్వరుని పూజించిన మూగజీవాలు ఆయనలో ఐక్యం కావడంతో శ్రీకాళహస్తి పట్టణానికి ఆపేరు వచ్చింది. ఇక్కడ సుమారు ఏడు ఎకరాల్లో సప్తగోకులం ఏర్పాటుతోపాటు ప్రత్యేకంగా గార్డెన్‌ను రూపుదిద్దుటకు ఎంఎల్ఏ చర్యలుతీసుకుంటున్నారు.